కరీంనగర్ స్ఫూర్తి, దీవెనలతోనే రాష్ట్రసాధన



మాట్లాడుతున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

- ఎనిమిది శాతం ఓట్లతో వినోద్ గెలుపు ఖాయం
- 150 హామీల్లో ఒక్కటీ నెరవేర్చని బీజేపీ
- బండి సంజయ్‌తో పైసా పనికాలేదు
- వినోద్‌కుమార్ కృషితోనే కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ
- బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్

కరీంనగర్, మే 9(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): తెలంగాణ ఉద్యమంలో కరీంనగర్ పాత్ర కీలకం.. ఉద్యమాల గడ్డ కరీంనగర్ స్ఫూర్తి, దీవెనలతోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. గులాబీ జెండా ఎత్తుకొని ఎస్ఆర్ఆర్ కళాశాల గ్రౌండ్‌లో జై తెలంగాణ నినాదంతో ముందుకు సాగిన నన్ను ఆశీర్వదించిన గడ్డ కరీంనగర్ అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మలి దశ ఉద్యమంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు సవాల్ విసిరితే రాజీనామాతో కరీంనగర్ నుంచి పోటీచేశానని, అప్పుడు 2.50 లక్షల మెజార్టీతో గెలిపించారని కేసీఆర్ గుర్తుచేశారు. ఎప్పుడు కరీంనగర్‌కు వచ్చిన బ్రహ్మాండంగా స్వాగతించారని, కరీంనగర్‌కు నా హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. అటువంటి ఉద్యమ స్ఫూర్తిని మళ్లీ చాటి ఎంపీగా ఉద్యమనేత, మేధావి, న్యాయవాది బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం రాత్రి కరీంనగర్‌లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వినోద్‌కుమార్‌కు మద్దతుగా నిర్వహించిన బస్సుయాత్ర, రోడ్ షో సందర్భంగా తెలంగాణ చౌక్‌లో ప్రజలనుద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. కరీంనగర్‌లో నా సర్వే ప్రకారం 8శాతం ఓట్ల ఆధిక్యతతో వినోద్‌కుమార్ ముం దంజలో ఉన్నారని, ఆయన గెలుపు ఖాయమైందని అన్నారు.

కరీంనగర్‌లో ముస్లిం మైనార్టీలు ఆలోచించాలని, మీరు కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బీజేపీ అభ్యర్థి గెలుస్తాడని, మత విద్వేషాలు రెచ్చగొట్టే బండి సంజయ్‌ని ఓడించి, సెక్యూలర్ వాది, ఉద్యమ కార్యకర్త వినోద్‌కుమార్‌కు ఓటు వేయాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ భావోద్వేగాల బ్లాక్ మెయిల్ ఇలాగే కొనసాగితే దేశం సర్వనాశనమవుతుందన్నారు. పదేళ్ల క్రితం 150 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ, నరేంద్రమోదీ అందులో ఒక్క హామీని కూడా నెర వేర్చలేదని ఆరోపించారు. మోదీకి ముందు 14 మంది ప్రధానమంత్రులు చేశారు.. వారు 55 లక్షల కోట్ల అప్పుచేస్తే మోదీ ఒక్కడే 105 లక్షల కోట్ల అప్పు చేశారని, రూపాయి విలువ 84కు పడిపోయిందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల భర్తీ జరుగలేదు.. ఏ ఒక్కరికి మేలు జరుగలేదని కేసీఆర్ విమర్శించారు. ఢిల్లీలో రైతులు ధర్నా చేస్తే 750 మందిని బీజేపీ ప్రభుత్వం పొట్టనబెట్టుకుందని, ఆ తర్వాత జరిగిన హర్యానా ఎన్నికల్లో గట్టెక్కేందుకు మోదీ రైతులకు క్షమాపణ చెప్పారని అన్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, సికింద్రాబాద్, నిజామాబాద్ నలుగురు బీజేపీ ఎంపీలు గెలిచినా నాలుగు రూపాయల పనిచేయలేదని, బండి సంజయ్ ఒక్క పనిచేశాడా.. గ్యాస్ మాటలు.. లొడలొడ వాగుడు, పార్లమెంట్‌లో ఆయన మాట్లాడితే ఎవరికి అర్థం కాదన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఒక్కటి మాత్రం అమలు చేశారని, అదీ ఉచితంగా బస్సుల్లో మహిళలకు ప్రయాణం చేయడమన్నారు. అయితే బస్సుల్లో మహిళలు సర్కస్‌లో మాదిరిగా కొట్లాడుకుంటున్నారని, వారే ఈ ఉచితం ఎందుకని తిరస్కరిస్తున్నారన్నారు. రైతుబంధు, రైతుబీమా ఇవ్వడంతో పాటు రెండు దఫాలుగా 30వేల కోట్ల రుణమాఫీ చేశామని కేసీఆర్ చెప్పారు. ఐదెకరాలపై భూమి ఉన్న రైతులు ఏం పాపం చేశారని కేసీఆర్ ప్రశ్నించారు. రైతుబంధు ఎత్తివేసేందుకే ఈ విధంగా మాట్లాడుతున్నారని కేసీఆర్ అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బి.వినోద్‌కుమార్, కరీంనగర్, హుజూరాబాద్ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, జడ్పీ చైర్ పర్సన్ కనుమల్ల విజయ, మేయర్ యాదగిరి సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు,నారదాసు లక్ష్మణ్‌రావు ఉన్నారు.

రోడ్ షో సక్సెస్

భారీగా తరలివచ్చిన జనం

పార్టీశ్రేణుల్లో జోష్

కరీంనగర్ టౌన్, మే 9: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్‌రావు కరీంనగర్‌లో నిర్వహించిన రోడ్‌షో విజయవంతమైంది. కేసీఆర్ బస్సుయాత్రలో భాగంగా గురువారం సాయంత్రం హైదరాబాద్ నుంచి బయలుదేరి 7.45 గంటలకు కరీంనగర్ రాంనగర్‌కు చేరుకోగానే నాయకులు డప్పుచప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ టి.భానుప్రసాద్ రావు, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, ఒడితెల సతీష్‌బాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణ, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్ స్వాగతం పలికారు.

కరీంనగర్, చొప్పదండి నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో చేరుకున్న ప్రజలకు కేసీఆర్ అభివాదం చేస్తూ మంకమ్మతోట, ముకరంపుర మీదుగా తెలంగాణ చౌక్‌కు చేరుకున్నారు. అనంతరం కేసీఆర్ 40 నిమిషాలపాటు ప్రసంగించారు. తీగెల వంతెన సాధించిన భీముడు గంగుల కమలాకర్, హుజూరాబాద్ టైగర్ పాడి కౌశిక్‌రెడ్డి అంటూ కేసీఆర్ సంబోధించడంతో కార్యకర్తలు ఈలలతో హోరెత్తించారు.



కార్యకర్తలు, ప్రజలు

నేడు పసిడికాంతుల పర్వదినం

అక్షయ తృతీయకు అంతా సిద్ధం



కరీంనగర్ కల్చరల్, మే 9: అక్షయ తృతీయ రోజున ఏది కొన్నా అక్షయంగా మారుతుందని శాస్త్రాలు చెపుతున్నాయి. అక్షయ తృతీయ పుణ్యఫలాల్ని ఇస్తుందని, ఆనాడు చేసే ఏ చిన్న దానమైనా ఈ జన్మలో, రాబోయే జన్మలో దారిద్ర్యం దరి చేరకుండా చేస్తోందని చెబుతారు. పరబ్రహ్మ వైశాఖ శుద్ధ తృతీయ రోజునే సృష్టికి శ్రీకారం చుట్టాడని అంటారు. ఈ రోజు గంగను స్మరిస్తూ లక్ష్మీదేవిని పూజించాలని, దానాలు ఆచరించాలని భవిష్య పురాణం చెప్తుతుంది. అందుకే బంగారాన్ని లక్ష్మీదేవిగా పూజిస్తారు. పుణ్య క్షేత్ర సందర్శన, పుణ్య తీర్థ స్నానాలకు ఫలం రెట్టింపుగా ఉంటుంది. అక్షయ తృతీయ నాడు దేవతలు భూ లోకంలో జనుల యోగక్షేమాలు పరీక్షించేందుకు వస్తారని ప్రతీతి. అందుకే మనసును, ఇంటిని సంతోషంగా ప్రశాంతంగా ఉంచుకోవాలి. ఈ రోజుననే పరశురామ జయంతి కావడంతో విష్ణువుకు చందనాది లేపనాలు, అలంకారాలు, పూజలు, జప, హోమ, తర్పణాదులు చేయాలని శాస్త్ర వచనం. ఈ నేపథ్యంలో శుక్రవారం అక్షయ తృతీయను జరుపుకోనున్నారు. అమ్మవారికి ఇష్టమైన వారం కావడంతో ఆధ్యాత్మికత సంతరించుకోనుంది,

బంగారం, ఆభరణాల కొనుగోళ్ల సందడి

అక్షయ తృతీయకు బంగారం కొనుగోళ్ల సందడి మంగళవారం నుంచే ఊపందుకుంది. సెంటిమెంట్‌తో వినియోగదారులు బంగారం, వెండి, బం గారు ఆభరణాలను కొనుగోలు చేస్తున్నారు. ఆర్నమెంట్ వస్తువులకు గిరాకీ ఉన్నా బంగారం మాత్రం కొంటున్నారు. నచ్చిన వారికి బహుమతులందిం చేందుకు 1500 రూపాయల నుంచి ఆర్నమెంట్ వస్తువులు అందుబాటులో ఉండగా జువెల్లరీ, స్వర్ణకారుల షాపులు సందడిగా మారాయి. అక్షయ తృతీయ సందర్భంగా పలు బంగారం షాపులతో పాటు స్టోర్లలో వివిధ ఆఫ ర్లు ప్రకటించారు. అక్షయ తృతీయను ఇలా ఆచరించాలి అక్షయ తృతీయ సందర్భంగా జిల్లావ్యాప్తంగా 3 కోట్లకు పైగా వ్యాపారం జరగనుననట్లు వ్యాపార వర్గాలు చెప్పాయి.

పిసరంతైనా బంగారం కొనాలి

అక్షయ తృతీయ నాడు బంగారాన్ని కొని వినియోగించుకున్నా, దానం చేసినా ఎంతో ఫలితం వస్తుందని నమ్ముతుంటారు. బంగారం ధరలు చుక్కలనంటుతున్నా జనం ఆభరణాలు, బంగారం వస్తువులు కొనుగోళ్లు చేస్తు న్నారు. 2 గ్రాముల నుంచి నాణాల రూపంలో బంగారం అందుబాటులోకి వస్తుండగా వాటిని కొని బహుమానాలుగా ఇచ్చే ఆనవాయితీ ఉంది.

కాంగ్రెస్ పార్టీ వద్ద ఫోన్ ట్యాపింగ్ పైసలు

- డబ్బులు ఖర్చు పెట్టి గెలవాలని చూస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్
- కరీంనగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్

తిమ్మాపూర్/గంగాధర/హుస్నాబాద్, మే 9: కాంగ్రెస్ పార్టీ వద్ద ఫోన్ ట్యాపింగ్ పైసలు ఉన్నాయని కరీంనగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే, ఫోన్ ట్యాపింగ్‌పై ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావచ్చు.. అని కరీంనగర్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ విమర్శించారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలగునూర్‌లో గల ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మానకొండూర్ నియోజకవర్గ స్థాయి పోలింగ్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరై పోలింగ్ ఏజెంట్లు చేపట్టాల్సిన కార్యక్రమాలు, పోలింగ్ రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ కేసును కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే మూసివేసిందని, ఎవ్వరి నోట నుంచి కూడా ఫోన్ ట్యాపింగ్ మాట రావడం లేదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే ఫోన్ ట్యాపింగ్ కేసు మూసివేయచ్చు అని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వేములవాడకు వచ్చి దర్శనం చేసుకుంటే దేశ వ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయి డిపాజిట్ గల్లంతైన వ్యక్తి అడ్రస్ లేకుండా పోయారని, మళ్లీ ఇప్పుడొచ్చి మాట్లాడుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్‌పై విరుచుకుపడ్డారు. కొండగట్టుకు వంద కోట్లు ఇస్తానని చెప్పిన కేసీఆర్ ఎందుకు ఇవ్వలేదన్నారు. కరీంనగర్ - వరంగల్ జాతీయ రహదారికి రోడ్డు నిర్మాణానికి తాను రూ. 51కోట్ల నిధులు తీసుకువస్తే, వినోద్‌కుమార్ రోడ్డు మరమ్మతు కోసం కేవలం కోటి రూపాయల నిధులు తెచ్చారన్నారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి, నాయకులు గడ్డం ఆరుణ్ తదితరులు పాల్గొన్నారు.

● ప్రజాస్వామ్యంలో ఓట్లడిగితే బిచ్చగాల్లంటారా?

ప్రజాస్వామ్యంలో ఓట్లు అడిగితే బిచ్చగాళ్లంటారా.. బీజేపీ నేతలు హిందువుల పేరు చెప్పుకుని ఓట్లు అడుక్కునే బిచ్చగాళ్లంటూ సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై కరీంనగర్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి బండిసంజ య్ కుమార్ స్పందించారు. గురువారం గంగాధర మండలం వెంకటయ్యపల్లి ఫంక్షన్‌హాల్‌లో చొప్పదండి నియోజకవర్గస్థాయి పోలింగ్ బూత్ ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము ప్రజాస్వామ్య బద్ధంగా చేసిన పని ఒప్పుకోవడంతో పాటు ప్రజాసమస్యలపై చేసిన పోరాటాలను,సేవలను గుర్తు చేస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా ఓట్లడుగుతున్నామన్నారు.

● గురువుకే పంగనామాలు పెట్టిన పొన్నం

రాజకీయ గురువు చొక్కారావును ఓడించిన జగపతిరావు కొడుకుని వెంటేసుకుని తిరుగుతూ గురువుకే పంగనామాలు పెట్టిన మంత్రి పొన్నం ప్రభాకర్ తనపై ఆరోపణలు చేయడం విడ్డూరమని కరీంనగర్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచా రంలో భాగంగా హుస్నాబాద్ పట్టణంలో బీజేపీ నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గౌరవెల్లి ప్రాజెక్టు బాధితుల పోరాటంలో తాను పాల్గొని బాధితులకు అడుగడుగునా అండగా నిలిచానని, ఆనాడు పొన్నం ప్రభాకర్ యాడ దాక్కున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో తప్ప బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌రావుకు చొక్కా నలగదు, చెమట పట్టదన్నారు. బ్యాలెట్ బాక్సులో గాడిద గుడ్డు ఉంటే కాంగ్రెస్‌కు ఓటేయండి. లేకుంటే ప్రతి ఒక్కరూ పువ్వు గుర్తుపై ఓటేసి గెలిపించాలన్నారు.



బండి సంజయ్‌ను సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు

పద్మశాలీలకు తోడుగా ఉంటా

- కులవృత్తులను కాపాడటంలో కాంగ్రెస్‌దే పైచేయి
- కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు



మాట్లాడుతున్న కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ అర్బన్, మే 9: కులవృత్తులను కాపాడటంలో దశాబ్దాల కాలం నుంచి కాంగ్రెస్ పార్టీదే పైచేయి అని ఆ పార్టీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు పేర్కొన్నారు. నగరంలోని పద్మశాలి భవన్‌లో గురువారం ఆ సంఘం నేతలతో రాజేందర్‌రావు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేందర్‌రావు మాట్లాడుతూ కులవృత్తులను రక్షించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడం కాంగ్రెస్ పార్టీ ముఖ్య ఉద్దేశం అన్నారు. ఇప్పటికే సిరిసిల్ల చేనేత కార్మికులకు చేసే సేవలో నిమిత్తం ఒక మేనిఫెస్టో విడుదల చేసినట్టు తెలిపారు. దాంతో పాటు మహిళలు, యువత, విద్యార్థులు, అన్ని వర్గాల వారికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మోసపూరిత ప్రకటనలు చేస్తూ ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్‌లను దరిదాపులకు రానివ్వవద్దని సూచించారు. బీజేపీ వస్తే రాజ్యాంగం రద్దయ్యే పెనుముప్పు పొంచి ఉందని, దేవుడి బొమ్మను అడ్డం పెట్టుకుని ఓట్ల కోసం ఎదురు చూసే వారికి తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. పద్మశాలి కులస్తుల కోసం బండి సంజయ్ చేపట్టిన ఒక్క మంచి కార్యక్రమం అయినా లేదని, ఒక అభివృద్ధి కార్యక్రమాన్ని కూడా చేయని సంజయ్ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. హస్తం గుర్తుపై ఓటు వేసి తనను ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం నేతలు హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాజేందర్‌రావును అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోడూరు సత్యనారా యణగౌడ్, జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు మెతుకు సత్యం, మాజీ ఎంపీపీ వొల్లాల కృష్ణహరి, మాజీ జెడ్పీటీసీ అరుకాల వీరేశలింగం, మాజీ సర్పంచ్ గడ్డం శ్రీరాములు, మాజీ కార్పొరేటర్, సహకార సంఘం అధ్యక్షులు మంచిగట్ల కోటేశ్వర్, శ్రీపతి వెంకటేశం, బుధవారం శ్రీనివాస్, బత్తిని సత్యనారాయణ, గాజంగి రాములు, వివిధ మండలాల నుంచి పద్మశాలి కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి.. కరీంనగర్ అభివృద్ధికి కృషి చేస్తాం

గన్నేరువరం, కరీంనగర్ ఎంపీగా వెలిచాల రాజేందర్‌రావును గెలిపిస్తే కరీంనగర్ అభివృద్ధికి కృషి చేస్తారని కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు సతీమణి వెలిచాల రేఖ అన్నారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆమె విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీలను కలిసి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజారిటీతో తన భర్తను గెలిపించాలని కోరారు. ఈవీఎంలో హస్తం గుర్తును చూపిస్తూ ప్రచారం నిర్వహించారు. వీరివెంట పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి, నాయకులు చిట్కూరి అనంతరెడ్డి, బొడ్డు సునీల్, జువ్వాడి మన్‌మోహన్‌రావు, న్యాత జీవన్, బుర్ర తిరుపతి, శ్రీకాంత్, వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న వెలిచాల రాజేందర్‌రావు సతీమణి రేఖ

కరీంనగర్‌లో కేసీఆర్ బస

నేడు సిరిసిల్ల, సిద్దిపేటలో బస్సు యాత్ర

కరీంనగర్‌టౌన్, మే 9: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్ రోడ్ షో అనంతరం బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గురువారం రాత్రి కరీంనగర్ తీగలగుట్టపల్లిలోని ఉత్తర తెలంగాణ భవన్‌లో బసచేశారు. శుక్రవారం సిరిసిల్ల, సిద్దిపేటలో నిర్వహించనున్న బస్సుయాత్రకు కరీంనగర్ నుంచి బయలు దేరి వెళ్లనున్నారు. తెలంగాణ చౌక్‌లో రోడ్ షో ముగిసిన వెంటనే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడికౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ భాను ప్రసాద్‌రావు, మేయర్ సునీల్ రావు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు నాయకులతో కలిసి ఉత్తర తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. ప్రస్తుతం కరీంనగర్ నియోజకవర్గ పరిధిలోని రాజకీయ పరిస్థితులు, గెలుపు ఓటములు తదితర అంశాలపై కేసీఆర్ చర్చించినట్లు తెలిసింది.

ఉపాధి కూలీల నిరసన

గన్నేరువరం, మే 9: ఉపాధిహామీ పనికి వెళ్లినప్పటికీ తమకు కూలి రావడం లేదని ఆగ్రహించిన కూలీలు మండలంలోని చాకలివానిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు మాట్లాడుతూ ఆరు రోజులు పనిచేస్తే నాలుగు రోజులకే హాజరు పడు తుందని మిగతా రెండు రోజులు హాజరు వేయడం లేదన్నారు. రెండు నెలలుగా పైసలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పని స్థలాల్లో నీడ, మంచినీటి వసతి ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. తాము వెంట తీసుకపోయిన మంచినీరు సరిపోవడం లేదని ఎండవేడికి కూలీలు వాంతులు చేసుకుంటున్నారని ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇచ్చిన దాఖలాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకొని ఎంపీడీవో శంకర్, ఎంపీవో నర్సింహారెడ్డి గ్రామపంచాయతీ వద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. ఇప్పటికైనా పనిస్థలాల్లో నీరు, నీడ ఏర్పాటు చేసి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలన్నారు. పని చేసినప్పటికీ వేతనం అందని వారికి వెంటనే పైసలు ఇప్పించాలని ఉపాధి కూలీలు డిమాండ్ చేశారు.

రైతులకు అండగా ఉంటాం

- కేంద్రాల నుంచి ధాన్యం మిల్లుకు తరలించాలి
- టార్పాలిన్‌లను అందుబాటులో ఉంచాలి

కరీంనగర్ రూరల్, మే9: ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ధాన్యం వెనువెంటనే కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం కరీంనగర్ రూరల్ మండలంలోని జూబ్లీ నగర్, చెర్ల బూత్కూర్, చామనపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రా లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాలలో తూకం వేసిన ధాన్యం వెంట వెంట నే మిల్లులకు తరలించాలని అన్నారు. అధికారులు రైతులకు టార్పాలిన్‌లను అందు బాటులో ఉంచాలన్నారు. ధాన్యం అమ్మిన రైతుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి సత్వరమే డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యాన్ని రైతులు శుభ్రం చేసి కేంద్రానికి తీసుకురావాలని, తరుగు పేరుతో ఎలాంటి కోత విధించవద్దని, రైతులకు నష్టం జరగకుండా చూడాలన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 341 కొనుగోలు కేంద్రాల ద్వారా 1,61,890 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, రైతులకు ఎప్పటి కప్పుడు డబ్బులు చెల్లిస్తున్నామని తెలిపారు. 60 నుంచి 70 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని, వర్షానికి తడవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వారం రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలని ఆమె అధికారులను ఆదేశించారు.



ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎస్ఓ సురేష్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రజనీకాంత్, జిల్లా సహకార అధికారి రామానుజాచార్య, పీఏసీఎస్ కార్యదర్శి రమేష్ రైతులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి

- పకడ్బందీగా ఈవీఎంలను డిస్ట్రిబ్యూషన్ చేయాలి
- అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ టౌన్, మే9: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సూచించారు. గురువారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ ఆధ్వర్యంలో చొప్పదండి నియోజకవర్గ సెక్టార్ ఆఫీసర్లు, ఈవీఎంలు డిస్ట్రిబ్యూషన్ చేసే సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ సెక్టార్ అధికారులు పోలింగ్ రోజున అన్ని ఏర్పాట్లు సరిగా ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. మే 13వ తేదీన ఆరు గంటలకే సిబ్బంది మాక్ పోలింగ్ నిర్వ హించాలని, ఏమైనా ఈవీఎంలు సక్రమంగా పనిచేయకపోతే వెంటనే మార్చాలని తెలిపారు. చెక్ లిస్టు ప్రకారం సిబ్బంది ఈవీఎంలు, మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ చేయాలని సూచించారు.

అన్ని సక్రమంగా అందించాలని, పోలింగ్ సజావుగా సాగేలా అందరూ సహకరించాలని తెలిపారు. బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాట్స్ తగిన మెటీరియల్ అంతా సక్రమంగా అందజేయాలని అన్నారు. ఎండల నేపథ్యంలో సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకొని విధులు నిర్వర్తిం చాలని సూచించారు. అనంతరం ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఏర్పాట్లను అదనపు కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో చొప్పదండి, రామడుగు తహసీల్దార్లు నరేందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి నగదు దోచుకున్న ఇద్దరి అరెస్టు

లక్షెట్టిపేటరూరల్, మే 9: పాత కొమ్ముగూడెం గ్రామానికి చెందిన కున్నారపు లచ్చవ్వ అనే మహిళకు మాయమాటలు చెప్పి డబ్బులు కాజేసిన ఇద్దరు నిందితులను గురువారం కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ నరేందర్, ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు. లచ్చవ్వ గ్రామంలో ఇంటి నిర్మాణం చేపడుతోంది. కరీంనగర్ జిల్లా వీణవంకకు చెందిన శివరాత్రి సదయ్య, పెద్దపల్లి మండలం తుర్కల మద్ది కుంటకు చెందిన గాదాసు రాజయ్యలు ఈ నెల 7న లచ్చవ్వ భర్త బయ టకు వెళ్లడం గమనించి ఇంటి నిర్మాణ పనులకు సిమెంటు, ఇటుక పంపి స్తున్నామని, రూ.25 వేలు ఇవ్వామన్నాడని చెప్పారు. లచ్చవ్వ రూ.24 వేలు ఇవ్వగా అక్కడ నుంచి వెళ్లిపోయారు. భర్త ఇంటికి వచ్చిన తర్వాత తాను ఎవర్ని పంపలేదని చెప్పడంతో మోసపో యానని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం స్థానిక కరీంనగర్ చౌరస్తాలో పోలీసులు వాహనాన్ని చూసి పారిపోతుండగా పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారన్నారు. నింది తుల నుంచి రూ. 23 వేల నగదు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ చంద్రకుమార్

వడదెబ్బతో ఉపాధిహామీ కూలీ మృతి

కాల్వశ్రీరాంపూర్, మే 9: పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని మీర్జంపేట గ్రామానికి చెందిన తిప్పని వెంకటలక్ష్మి(56) గురువారం గ్రామంలో ఉపాధిహామీ పనులు చేస్తూ వడదెబ్బకు గురైంది. పనిచేసే చోటనే అస్వస్థకు గురికాగా వెంకటలక్ష్మిని కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ మృతి

కోరుట్ల, మే 9: పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన బొగడమీది గౌరీ (32) అనే మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు గురువారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆశోక్-గౌరీ దంపతులు కూలీ పనులు చేస్తూ అల్లమయ్య గుట్ట ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. బుధవారం సాయంత్రం ఇంటికి వచ్చిన ఆశోక్ తన వెంట మటన్ తీసుకురాగా వంట విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తీవ్ర మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన ఆశోక్ చుట్టు ప్రక్కల వారి సహకారంతో గౌరీని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు గౌరీని మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించినట్లు తెలిపారు. కరీంనగర్‌లో చికిత్స పొందుతూ గౌరీ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గౌరీ సోదరుడు నగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గౌరీకి ఇద్దరు మగపిల్లలు ఉన్నారు.

ఇందిరమ్మ కాలనీలో కార్డన్‌సెర్చ్



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

తంగళ్లపల్లి, మే 9: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో పోలీసులు గురువారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలోని ప్రతీ ఇంటిని సోదా చేశారు. కొత్త వ్యక్తుల సమాచారాన్ని సేకరించారు. వాహనాల రిజిస్ట్రేషన్ తదితర అంశాలను పరిశీలించారు. తనిఖీల్లో ఎస్సై సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

వస్త్ర వ్యాపారులు, ఆసాములకు బెదిరింపులు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, మే 9: కాంగ్రెస్ నాయకులు కొందరు వస్త్ర వ్యాపారులను, ఆసాములను బెదిరింపులకు గురి చేస్తున్నారని, బలవంతంగా స్టేట్‌మెంట్స్ ఇప్పిస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. గురువారం సిరిసిల్ల బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అబద్ధాలు చెప్పి గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తానని బోగస్ ముచ్చట చెప్పాడన్నారు. ఐదు సంవత్సరాలలో ఏ పల్లె ఎరగని బండి సంజయ్ తెల్లారితే మోదీ, రాముడు, మతం పేరిట గెలవాలని చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రూ. 50 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. వస్త్ర పరిశ్రమపై ప్రేమ ఉంటే వెంటనే బకాయిలను విడదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల లోపు వస్త్ర పరిశ్రమకు, వ్యాపారులకు, ఆసాములకు, కార్మికులకు తీపి కబురు చెప్పాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సాయంత్రం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ గెలుపు కోసం ప్రచారంలో భాగంగా సిరిసిల్లకు వస్తున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి ఆటో బోల్తా
ఐదుగురికి గాయాలు

ధర్మారం, మే9: ధర్మారం మండల కేంద్రంలోని ధర్మారం-పెద్దపల్లి రహదారిపై ఓ ప్రైవేట్ పాఠశాల సమీపంలో గురువారం రాత్రి అదుపు తప్పి ఆటో బోల్తా పడిన ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఇందులో ముగ్గురికి తీవ్ర గాయాలు గాయాలు కాగా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గురువారం రాత్రి ధర్మారంలో జరిగిన మంత్రి శ్రీధర్ బాబు రోడ్ షోకు గోపాల్‌రావుపేట గ్రామం నుంచి 8మంది వచ్చారు. తిరి గి ఆటోలో గోపాల్‌రావుపేటకు వెళ్తుండగా ఓ ప్రైవేట్ పాఠశాల సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జంగిలి బక్కయ్య, అందె తులశమ్మ, ఆటో డ్రైవర్ పోతు లచ్చయ్యలకు తీవ్ర గాయాలు కాగా శనిగారపు రాజమ్మ, బింగి మల్లమ్మలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పగలు వ్యాపారం.. రాత్రిపూట దొంగతనాలు

- ఘరానా దొంగను అరెస్టు చేసిన పోలీసులు

కుకునూరుపల్లి, మే 9: పగటిపూట బట్టలు అమ్ముతూ, రాత్రిపూట దొంగతనాలకు పాల్పడుతున్న ఘరానా దొంగను కుకునూరుపల్లి పోలీసులు పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి, సీఐ లతీఫ్‌తో కలిసి గురువారం విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి వివరాలను వెల్లడించారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం బర్కత్పుర కాలనీకి చెందిన షేక్ సలీం(53) ఊరూరు తిరుగుతూ బట్టలు అమ్ముతుంటాడు. సలీంకు వచ్చే డబ్బు సరిపోకపోవడంతో రాత్రిపూట దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. సంవత్సర కాలంగా గ్రామాలు, పట్టణాలలో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటున్నాడు. ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాల్లో ఉన్న నగదును ఎత్తుకెళ్లేవాడు. కుకునూరుపల్లి బస్టాండ్ ఆవరణలో బుధవారం రాత్రి అనుమానాస్పదంగా కనిపిస్తూ ఉన్న సలీంను పోలీసులు పట్టుకొని విచారించగా సంవత్సర కాలంగా రాత్రిపూట దొంగతనాలు చేస్తున్నారని ఒప్పుకున్నాడు. సిద్దిపేట, చేర్యాల పట్టణాల్లో, వంటిమామిడి, కొడకండ్ల, నారాయణరావుపేట్ గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడ్డాడు. భారీ మొత్తంలో బంగారం, నగదును దొంగిలించాడు. కేసులో కీలకంగా వ్యవహరించిన సీఐ లతీఫ్, ఎస్సై శ్రీనివాస్, క్రైమ్ పార్టీ సిబ్బంది రమేశ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

ఈదురు గాలులు.. వర్షం

- తడిసి ముద్దయిన ధాన్యం
- లేచిపోయిన ఇళ్ల పై కప్పు రేకులు
- అన్నదాతల అవస్థలు
- కొనుగోళ్లు వేగవంతం చేయాలని వినతి



కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షం నీరు

కథలాపూర్, మే 9: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గురువారం ఈదురు గాలులు.. వర్షం కురిసింది. కథలాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం కురిసిన వడగళ్లు, ఈదురుగాలులు, భారీ వర్షం బీభత్సం సృష్టించాయి. కలికోట, అంబారిపేట, ఇప్పపల్లి, పోతారం గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచి ముద్దయింది. రైతులు ధాన్యం ఆరబెట్టుకోగా అనూహ్యంగా కురిసిన వర్షం వల్ల పూర్తిగా ధాన్యం తడిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తూకం వేసిన ధాన్యం సంచులు తడిచిపోవడంతో మొలకలెత్తే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట వర్షార్పణం కావడం కారణంగా తీవ్ర నష్టం వాటిల్లిందని పేర్కొం టున్నారు. అదేవిధంగా పెగ్గెర్ల, ఊట్‌పల్లి గ్రామాల్లో ఈదురు గాలులకు ఇళ్లపై ఉన్న రేకులు ఎగిరి పడ్డాయి. ధాన్యం వద్ద నీళ్లు నిలవగా రైతులు మరో చోటికి తరలించుకుంటున్నారు.

బీర్‌పూర్: మండలంలో గురువారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. 15 నిమిషాల పాటుగా కుండపోతగా కురిసింది. ఆకస్మాత్తుగా కురిసిన వర్షం కారణంగా బీర్‌పూర్‌లోని రెండు కొనుగోలు కేంద్రాలలో, తుంగూర్‌లోని కొనుగోలు కేంద్రంలో, కొల్వాయిలోని కొనుగోలు కేంద్రంలో, కండ్లపెల్లిలోని కొనుగోలు కేంద్రంలో, చెర్లపెల్లి, నర్సింహులపల్లి కొనుగోలు కేంద్రాలలో ఉన్నా వరి ధన్యం రాసులు తడిసిపోయాయి. ఒక్కసారి వర్షం రావడంతో రైతులు ధాన్యంపై కవర్లు వేయలేక పోయారు.

రుద్రంగి: రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలో సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. అలాగే రుద్రంగి మండల కేంద్రంలో కురిసిన వర్షనికి ధాన్యం తడిసి ముద్దయిదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మ్యాచర్ వచ్చి చాలా రోజులు గడుస్తున్నా ధాన్యం తూకం వేయడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చెస్తున్నారు. తడిసిన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు.



మానాలలో కురిసిన వడగండ్లు



రుద్రంగిలో తడిసిన ధాన్యం



పెగ్గెర్లలో ఎగిరిపడ్డ రేకులు



బీర్‌పూర్‌లో కురుస్తున్న వర్షం

శంకర జయంతి ఉత్సవాలు ప్రారంభం



శంకరాచార్యుల వారి చిత్రపటం వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ, మే 9: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీ శంకర జయంతి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం వేళలో ఆలయ అర్చకులు శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతలకు అర్చనలు నిర్వహించారు. అనంతరం శ్రీ స్వామివారి అద్దాల మండపంలో శ్రీ శంకరాచార్యుల చిత్రపటానికి ఉపనిషత్ ద్వారాభిషేకం, పూజలు గావించారు. శంకర పారాయణం, ఆధ్యాత్మిక ప్రవచనం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఐదు రోజులపాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు శ్రీ స్వామివార్లకు, శ్రీ శంకరాచార్యులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని ఆలయ అధికారులు తెలిపారు.

మహిళా ఖైదీల పిల్లలకు ఆశ్రయం కల్పించేందుకు కృషి



జైలును సందర్శించిన సీడబ్ల్యూసీ సభ్యులు

కరీంనగర్ క్రైం, మే 9: మహిళా ఖైదీలకు పిల్లలు ఉన్నట్లయితే వారికి విద్య, ఆశ్రయం, ఉపకార వేత నం అందించేందుకు కృషి చేస్తామని బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ధనలక్ష్మి అన్నారు. జైలులో ఉన్న మహిళలకు సంబంధించిన పిల్లల రక్షణ, సంరక్షణ, విద్యా తదితర విషయాలను తెలుసుకునేందుకు కరీంనగర్ బాలల సంక్షేమ సమితి(సీడబ్ల్యూసీ) ప్రతినిధులు గురువారం కరీంనగర్ జైలు అధికారులతో కలిసి జైలులోని మహిళా విభాగం బారక్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న మహిళఖైదీలతో మాట్లాడి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. మహిళా ఖైదీలకు పిల్లలు ఉన్నట్లయితే వారికి చేయూతనందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జైలు అధికారులు రమేశ్, సంగీత, బాలల సంక్షేమ సమితి సభ్యులు రేండ్ల కళింగశేఖర్, విజయ్, రాధా, అర్చనరెడ్డి, జైలు అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, మే 9: ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌కు చెందిన గడ్డి రమేష్ అదృశ్యంపై కేసు నమోదు చేశామని పోలీసులు గురువారం తెలిపారు. తిమ్మాపూర్‌కు చెందిన రమేష్ భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈ నెల 7న పనులు ముగించుకొని ఇంటికి చేరుకున్న రమేష్ అదే రోజు రాత్రి కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటకు వెళ్లాడు. చీకటి పడిన ఇంటికి రాకపోవడంతో రమేష్ భార్య స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. యువకుడు మృతి

జూలపల్లి, మే 9: మండలంలోని కాచాపూర్ గ్రామంలో గురువారం పుట్ట ప్రశాంత్(32) ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో మృతిచెందినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. ట్రాక్టర్ నడుపుకుంటూ కటుంబాన్ని పోషించుకుంటున్న ప్రశాంత్ ఊరచెరువు సమీపంలో కల్వర్టు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడడంతో దాని కిందపడి మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఓటర్లను ప్రలోభాలకు గురి చేసిన ఐదుగురిపై కేసు

హుజూరాబాద్, మే 9: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని కోర్టు సమీపంలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో ఆర్ఎంపీ వైద్యులకు విందు ఇచ్చి ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినందుకు ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఆర్ రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ఐదుగురి రాజకీయ నాయకులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇందులో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎమ్మెల్సీ నారాదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, వి రవీందర్‌రావు ఉన్నారు. ఈ కేసులో మరో 20మంది ఉన్నారనితఈ మేరకు విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా బుధవారం రాత్రి ఆర్ఎంపీ వైద్యులకు ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకులు విందు ఇవ్వగా కాంగ్రెస్ నాయకులు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశాడరు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు దాడులు చేసి విచారణ చేపట్టారు.

మూడు సెల్‌ఫోన్లు చోరీ

హుజూరాబాద్, మే 9: హుజూరాబాద్ పట్టణంలో గురువారం వారసంతలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. బొప్ప రాజేందర్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు, చెడమాపి కృష్ణమూర్తితో పాటు మరొకరు కూరగాయల కోసం మార్కెట్‌కు వచ్చి కూరగాయలు కొనుగోలు చేస్తున్నాడు. ఈ క్రమంలోనే జేబులో ఉన్న సెల్‌ఫోన్లు మాయమయ్యాయి. దీంతో బాధితులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కాగా గతంలో కూడా ఇదే వారసంతలో చాలా సెల్‌ఫోన్లను దొంగతనం చేశారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఆరుగురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, మే 9: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో పట్టుబడిన ఆరుగురు వ్యక్తులకు జైలు శిక్ష పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన 25 మంది వాహనదారులను గురువారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా ఒక వ్యక్తికి 10 రోజులు, మరొకరికి 7 రోజులు, ఇంకొకరికి 5 రోజులు, ముగ్గురు వ్యక్తులకు 3 రోజుల జైలు శిక్ష, మొత్తం 12,500 రూపాయల జరిమానాను జడ్జి విధించారని సీఐ తెలిపారు. మిగతా 19 మంది వాహనదారులకు 32వేల రూపాయల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

పోలీసు తనిఖీల్లో నగదు పట్టివేత

కరీంనగర్ క్రైం, మే 9: కరీంనగర్‌లో గురువారం నిర్వహించిన వాహన తనిఖీల్లో వేరు వేరు ఘటనల్లో సరైన ఆధారాలు లేని మొత్తం 12 లక్షల 56 వేల 3 వందల రూపాయల నగదు పట్టుబడింది. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా అక్రమ డబ్బు, మద్యం సరఫరా అరికట్టేందుకు కరీంనగర్‌లోని పలుచోట్ల వాహనాల తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. కరీంనగర్ ఒకటో ఠాణా పరిధిలోని రాజీవ్‌చౌక్‌లో నిర్వహించిన వాహనాల తనిఖీలో అశోక్‌నగర్‌కు చెందిన నార్ల నరేష్‌కుమార్ వద్ద లక్షా 60 వేలు, కమాన్‌రోడ్‌కు చెందిన విజయరాఘవన్ విబిన్ వద్ద 2 లక్షల 40 వేలు రూపాయలు పట్టుబడ్డాయి. ఈ నగదును సీజ్ చేసి తదుపరి ప్రక్రియ కోసం సంబంధిత అధికారులకు స్వాధీనం చేశామని సీఐ సరిలాల్ తెలిపారు. అలాగే మూడో ఠాణా పరిధిలోని కాపువాడ చౌరస్తా వద్ద నిర్వహించిన వాహనాల తకీల్లో బహదూర్‌ఖాన్ పేటకు చెందిన టి సంజీవ్ వద్ద 3 లక్షల 76 వేల 300 రూపాయల నగదు, నాకా చౌరస్తా వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో కిసాన్‌నగ ర్‌కు చెందిన జె రమేష్ వద్ద 2 లక్షల 5 వేల రూపాయలు, కోర్టు చౌరస్తా వద్ద విద్యానగర్‌కు చెందిన పోలోజు నందం వద్ద లక్షా 75 వేలు, వావిలాలపల్లికి చెందిన జె శ్రీనివాస్ వద్ద లక్ష రూపాయల నగదు పట్టుబడిందని, ఈ నగ దును సీజ్ చేసి సంబం ధిత ఎన్నికల విభాగం అధికారులకు స్వాధీనం చేశామని సీఐ జాన్‌రెడ్డి తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న వెండి వస్తువులు



పట్టుబడిన నగదును చూపుతున్న సీఐ సరిలాల్

- నగదు, వెండి వస్తువులు స్వాధీనం

కరీంనగర్‌లోని కోర్టుచౌరస్తా వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో గంగాధర మండలం ఘర్షకుర్తి గ్రామానికి చెందిన కట్ట శ్రీనివాసచారి వద్ద సరైన ఆధారాలులేని 4 లక్షల 36 వేల 300 రూపాయల నగదును పట్టుకున్నారు. అలాగే గుంటూరు జిల్లా తెనాలి మండలం, నెలపాడు గ్రామానికి చెందిన నల్లబోతుల గొప్ప రాజు వద్ద దాదాపు 3 లక్షల విలువైన 4 కిలోల వెండి వస్తువులు బహుమతులను పట్టుకున్నట్లు రెండో ఠాణా సీఐ సీఐ విజయ్ కుమార్ తెలిపారు. పట్టుబడిన నగదు, వెండి బహుమతులను తదుప రి ప్రక్రియకు సంబంధిత అధికారుల వద్దకు తరలించామని తెలిపారు.

జగిత్యాలలో తనిఖీలు

జగిత్యాల టౌన్, మే 9 : జగిత్యాల జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, మంచినీళ్ల బావి, బైపాస్ రోడ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తుల వద్ద రూ. 13.5 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి పత్రాలు లేని వాహనాలు పట్టుకుని జరిమానాలు విధించారు.

కొండగట్టులో యువకుడి ఆత్మహత్య

మల్యాల, మే 9: కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన సిరిగిరి సమ్మయ్య(37)అనే వ్యక్తి దిగువ కొండగట్టులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో జరిగిన రైలు ప్రమాదంలో కుడి కాలు, చేతి కోల్పోవడంతో తీవ్ర మనస్తాపంతో ఉన్న సమ్మయ్య కుటుంబపోషణకు గాను పని చేయడానికి వారం రోజుల క్రితం కొండగట్టు వచ్చాడు. అయితే గురువారం ఓ హోటల్ ముందు మృతి చెంది ఉండడంతో స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబసభ్యులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. సమ్మయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు

ఏకలవ్య గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డిపేట, మే 8: ఉమ్మడి జిల్లాలోని గిరిజన ఏకలవ్య గురుకుల కళాశాలల్లో ప్రవేశాల కోసం 2023-2024 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని గురుకులాల ఆర్‌సీవో డీఎస్. వెంకన్న గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట(బాలికలు), మరిమడ్ల(బాలురు) కళాశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ విభాగాల్లో ప్రవేశాల కోసం ఈ నెల 9 నుంచి 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పదో తరగతి మార్కుల ప్రతిభ ఆధారంగా ఈ నెల 24న ఉదయం 9 గంటల నుంచి ఎల్లారెడ్డిపేటలోని ఏకలవ్య గురుకులంలో కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు.

ప్రారంభమైన ఎప్‌సెట్

- జిల్లా వ్యాప్తంగా 9 కేంద్రాల ఏర్పాటు



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

తిమ్మాపూర్, మే 9: ఇంజనీరింగ్ ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ ప్రవేశ పరీక్షలు గురువారం ప్రారంభం అయ్యాయి. ఈ పరీక్షలు శుక్రవారం, శనివారం కూడా కొనసాగనున్నాయి. ఈ పరీక్షలకు గురువారం కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండు సెషన్‌లలో జరిగిన ఈ పరీక్షకు ఉదయం 9 గంటల నుంచి జరిగిన మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన మొదటి సెషన్‌లో 9 పరీక్ష కేంద్రాలలో కలిపి 2,449 మందికి 2393 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా 56 మంది హాజరుకాలేదు. మధ్యాహ్నం 3గంటల నుంచి 6 గంటల వరకు జరిగిన రెండవ సెషన్‌లో 2,450 మందికి 2395 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా 55 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని నిర్వాహకులు తెలిపారు. పరీక్ష సమయానికి గంటన్నర ముందు నుంచే విద్యార్థులనుఅనుమతించారు.

చేపల వేట కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగిలి యువకుడి మృతి

- ఎల్లారెడ్డిపేట మండలం సింగారంలో ఘటన

ఎల్లారెడ్డిపేట, మే 9: ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామంలో చేపలను వేటాడేందుకు అమర్చిన విద్యుత్ తీగలు ముత్యాల బాలకృష్ణ (38) అనే యువకుడు గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కిషన్ అతడి స్నేహితులు పుటకుల్ల సుధీర్, బొమ్మడి శంకర్‌తో కలిసి చేపలు పట్టేందుకు గ్రామ శివారులోని మానేరు వాగులోని చెక్ డ్యాం వద్దకు వెళ్లారు. నీటిలో తీగలను అమర్చి వాటికి కరెంటు సరఫరా అయ్యేలా ఏర్పాటు చేసుకున్నారు. ప్రమాదవశాత్తు కిషన్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆందోళనకు గురైన సుధీర్, శంకర్ అక్కడి నుంచి పారిపోయారు. అక్కడే ఉన్న వ్యక్తులు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో భార్య, పిల్లలు రోదనలు మిన్నంటాయి. సుధీర్, శంకర్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని వివరించారు. మృతుడికి భార్య కావ్య, ఇద్దరు కూతుళ్లు సహస్ర, లాస్యప్రియ, కుమారుడు అఖిల్‌తేజ్ ఉన్నారు. గత యేడాది జూలై 2న అదే గ్రామానికి చెందిన బొమ్మడి నారాయణ చేపల వేటకు వెళ్లి కరెంటు షాక్‌తో మృతి చెందాడు. విద్యుత్తు తీగలు అమర్చి చేపలను వేటాడడంతో ప్రమాదవశాత్తు ప్రాణాలను కోల్పోతున్నారు. సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



హరీష్(ఫైల్)

పాలకుర్తి, మే 9: విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. బసంత్ నగర్‌కు చెందిన కొమ్మ హరీష్(24) సాయంత్రం ఒక్కసారిగా వచ్చిన అకాల వర్షానికి గోడలు తడిసి పైన ఉన్న బట్టలు ఆరవేసే దండానికి విద్యుత్ సరఫరా అయ్యింది. ఇది గమనించని హరీష్ చెయ్యి పైకి లేపడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. బంధువులు, స్నేహితులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. అవివాహితుడైన హరీష్‌కు తల్లి, సోదరుడు ఉన్నారు. బసంత్‌నగర్ ఆలయ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో సహాయకుడిగా ఉద్యోగం చేస్తున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాపు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రిజర్వేషన్ల రద్దు ప్రచారం కుట్ర

- బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్



మాట్లాడుతున్న బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్

భగత్‌నగర్, మే 9: బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారంటూ కాంగ్రెస్ ప్రచారం చేయడం వెనుక కుట్ర దాగి ఉందని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్‌కుమార్ అన్నారు. గురువారం కరీంనగర్‌లోని ఎంపీ కార్యాల యంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓట్లను కొల్లగొట్టేందుకు కాంగ్రెస్ ఆడుతున్న డ్రామాలో భాగమే అన్నారు. అంబేద్కర ప్రజాస్వామ్య దేశంలోని అనేక విషయాలను జోడించి ప్రపంచంలోనే ఆదర్శమైన రాజ్యాంగాన్ని రాశారన్నారు. దళితుడైన అంబేద్కర్‌ను కాంగ్రెస్ పార్టీ అవమానించిందన్నారు. ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్‌భగత్ మాట్లాడిన అంశాలను వక్రీకరిస్తున్నారని ఎస్.కుమార్ అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

మల్యాల, మే 9: మండలంలోని నూకపల్లి డబుల్‌బెడ్ రూం ఇళ్ల వద్ద గుడుంబా అమ్ముతున్న నూకపల్లికి చెందిన సిలువేరి లక్ష్మి వద్ద మూడు లీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు ఎస్సై అబ్దుల్‌రహీం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మికి గుడుంబాను సరఫరా చేస్తున్న రాజారం గ్రామానికి చెందిన తిరుమలేష్‌తో పాటు లక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గుడుంబా తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటమని హెచ్చరించారు.

కొనుగోలు కేంద్రాలకు స్థలాల కొరత

- రోడ్ల పైనే ధాన్యం కుప్పలు
- ప్రమాదమని తెలిసినా రైతన్నకు తప్పని దుస్థితి

పెగడపల్లి, మే 9: ధాన్యం కొనుగోలు కేంద్రాలకు శాశ్వత స్థలాలు లేక ఆరుగాలం శ్రమించి ధాన్యం పండించిన రైతన్నలు ఇబ్బందులు పడుతున్నారు. పెగడపల్లి మండలంలోని 23 గ్రామాలు ఆయకట్టు పరిధిలోని ఉన్నాయి. మండలంలోని 90 శాతానికి పైగా భూములలో వరి పంటనే సాగు చేస్తారు. పండించిన ధాన్యాన్ని విక్రయించుకునేందుకు మండలంలోని పెగడపల్లి, నంచర్ల, నందగిరి సహకార సంఘాలతో పాటు సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల చేత ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేస్తున్నారు. ఆయా గ్రామాలలోనే రైతులకు అందుబాటులోనే కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నప్పటికి వాటికి సరైన స్థలాలు లేక ప్రధాన రహదారులైన తారు రోడ్లకు ఇరువైపులా ధాన్యం కుప్పలు పోసి తూకం వేయించుకోవాల్సిన పరిస్థితులు అన్ని గ్రామాలలోని కొనుగోలు కేంద్రాలలో ఉంది. దీనికి తోడు గుట్ట బోర్లకు, పంట పొలాలలో కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఎగుడు దిగుడు భూములలో ధాన్యం పోసి చిన్న పాటి వర్షం వచ్చినా ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. గుట్టబోర్ల పైన ఏర్పాటు చేసిన కేంద్రాలలో ఏ కొద్ది వర్షం పడినా ధాన్యం కొట్టుకు పోతుండగా , పంట పొలాలలో ఏర్పాటు చేసి కేంద్రాలలో వర్షాలు కురిసినపుడు ధాన్యం కుప్పలు, తూకం వేసిన సంచులు తడిసిపోతున్నాయి. దీంతో తూకం వేయకపోవడం తడిసిన ధాన్యం పేరిట తరుగు తీయడంతో నష్టపోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. మండలంలో ప్రతి పంటకు 3.50 లక్షల నుంచి 4 లక్షల క్వింటాల్ల వరకు ధాన్యం తూకం వేస్తుండగా మండలంలోని 23 గ్రామాలలో ఎక్కడా కూడా శాశ్వత స్థలాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు శాశ్వత స్థలాలు ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులకు అధికారులకు ప్రతి యేటా రైతులు మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే నాథుడే లేడని వాపోతున్నారు. రైతుల శ్రేయస్సు గురించి మాట్లాడే ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలకు శాశ్వత స్థలాలు చూపించి సిమెంట్ ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

శాశ్వత స్థలాలు కేటాయించాలి..

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అన్ని గ్రామాలలో ప్రభుత్వ స్థలాలను కేటాయించి శాశ్వత కేంద్రాలు ఏర్పాటు చేయాలి, ఎంతో కష్టపడి పండించిన ధాన్యం విక్రయించుకుందామంటే సరైన కేంద్రాలు లేక మట్టిలో, ఎగుడు దిగుడు స్థలాలలో ధాన్యం కుప్పలు పోసి ఇబ్బందులు పడుతున్నాం. పండించిన ధాన్యం మట్టిలో కలసిపోతోంది. కొనుగోలు కేంద్రాలలో సిమెంట్ ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేసి ధాన్యం మట్టిలో కలసి పోకుండా చూడాలి.

- ప్రశాంత్ రావు. పెగడపల్లి.



రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పలు

అన్ని వర్గాల సంక్షేమానికి చర్యలు

-కాంగ్రెస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు



పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ అర్బన్/లీగల్, మే 9: పద్మశాలి కులస్తులతో అన్ని వర్గాల ఆర్థిక, సామాజిక భద్రతకు తాను కట్టుబడి ఉన్నానని కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు పేర్కొన్నారు. కరీంనగర్ నగరంలోని స్పెన్సర్‌లో గురువారం కరీంనగర్ బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, పద్మశాలి సంఘం జిల్లా నాయకులు పివి రాజ్‌కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు వెలిచాల రాజేందర్ రావు కండువా కప్పి సాదరంగా కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్, డీసీసీ ఉపాధ్యక్షుడు రాచకొండ ప్రభాకర్, అడ్వకేట్లు కుమారస్వామి, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

●కరీంనగర్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇస్తున్నట్లు విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్యా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లోజు రాజు ప్రకటించారు. గురువారం స్థానిక పద్మనాయక కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

●చొప్పదండి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని కాట్నపల్లిలో గురువారం ఆయన ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

●గంగాధర: ప్రజాసంక్షేమాన్ని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు విస్మరించాయని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండలం చర్లపల్లి, లక్ష్మీదేవిపల్లి, నాగిరెడ్డిపూర్, నారాయణపూర్, గంగాధర, మధురానగర్, మల్లాపూర్, గోపాల్‌రావుపల్లి, వెంకంపల్లి, కాసారం, గర్శకుర్తి గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావుకు మద్దతుగా ఎన్నిక ల ప్రచారం నిర్వహించారు.

●రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లిలో రాజేందర్ రావుకు మద్దతుగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఎన్నికల ప్ర చారం నిర్వహించారు కార్యక్రమంలో ఎంపీపీ హరీష్, ముర ళీకుష్ణారెడ్డి, అంజనీప్రసాద్, లచ్చయ్య, రమేశ్ పాల్గొన్నారు.

●ఇల్లందకుంట: ప్రజావ్యతిరేక, మతోన్మాద బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వర్ణ వెంకటరెడ్డి అన్నారు. గురువారం ఇల్లందకుంట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యుడు ముకుందరెడ్డి పాల్గొన్నారు.

●మానకొండూర్: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్ద తుగా సీపీఎం ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరు వాస్తవరెడ్డి, మానకొండూర్ కార్యదర్శి ఎస్. సంపత్, సంపత్, సతీష్, శ్రీనివాస్, రాజు, నారా యణ, సంపత్‌రెడ్డి, రాయమల్లు, పాల్గొన్నారు.

●తిమ్మాపూర్: కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని కొత్తపల్లి, పర్లపల్లి, మొగిళిపాలెం, మల్లాపూర్, తిమ్మాపూర్, మన్నెంపల్లి, పోరండ్ల గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పునూటి శ్రీనివాస్, ఎడ్ల రమేశ్, జి రమేశ్ పాల్గొన్నారు.

బండి సంజయ్ గెలుపునకు కృషి

-బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా నాయకుల ప్రచారం



మాట్లాడుతున్న బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాస్

గణేశ్‌నగర్, మే 9: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్‌కు బీసీ సంఘాలు పూర్తిస్థాయి మద్దతు ప్రకటిస్తున్నామని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ తెలిపారు. గురు వారం బీసీ సంఘం కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిగుర్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి ధ్యేయంగా ముందుకు వస్తున్న బండి సంజయ్ కుమార్‌ని గెలిపించడంలో ప్రతి బీసీ బిడ్డ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ మహిళా సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గున్నాల కన్నాంబ, బీసీ యువజన సంగం జిల్లా కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్, బిసి యువజన సంఘం నగర అధ్యక్షులు అనుమాస నితిన్, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు బెల్లం నరేందర్ బీసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

●భగత్‌నగర్: ముస్లింల అభ్యున్నతికి బీజేపీ కట్టుబడి ఉందని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అఫ్సర్‌పాషా అన్నారు. గురువారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు వచ్చినప్పుడే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు మైనార్టీలు గుర్తుకు వస్తారన్నారు. స్థానిక ఎమ్మెల్యే ముస్లింల భూమిని కబ్జా చేయడతో పాటు, రేకుర్తిలో ఇళ్లను పడగొట్టిన విషయాన్ని ముస్లింలు గుర్తుంచుకోవాలన్నారు.

●బండి సంజయ్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపిం చాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటే శ్వర్లు, ఉపాధ్యక్షుడు పొన్నూరు వినోద్‌కుమార్, మనికొండ రమేష్ కోరారు. గురువారం నగరంలోని ఎంపీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 23శాతం జనభా మున్నూరుకాపులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు.

●రేకుర్తి 17, 18,19 డివిజన్లలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జులతో కోఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించి డమ్మీ బ్యాలెట్ నమూనాను ప్రదర్శించారు. కార్యక్రమంలో వెంకటస్వామి, పొన్నాల రాము, పర్వతం మల్లేశం, గుండారం సంపత్, ప్రతాప్‌రెడ్డి, లక్ష్మీరాజం, విష్ణుప్రసాద్‌రావు, మైపాల్‌రెడ్డి, నాంపల్లి శంకర్, బండ రాకేష్, గంట నర్సింహారెడ్డి, చంద్రగిరి వేణు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

●హుజూరాబాద్ రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సిర్సపల్లి, వెంకట్రావ్‌పల్లి, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు పార్లమెంట్ ఎన్నికల వేళ బీజేపీ పార్టీ ప్రకటించిన సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు.

●చిగురుమామిడి: మండలంలోని సీతారాంపూర్, రామంచ, ముది మాణిక్యం గ్రామాల్లో బీజేపీ మండల ఎన్నికల ఇన్‌చార్జి అమరగాని ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు గునుకుల మధుసూదన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గజా శ్యామ్ సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యత

-ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్ అర్బన్, మే9: రాజ్యాంగాన్ని రక్షించుకోవడం మన అందరి బాధ్యత అని, రిజర్వేషన్లను రద్దు చేసేందుకు కమలనాథులు చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. గురువారం పద్మనాయక కళ్యాణ మండపంలో రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం అనే అంశంపై నిర్వహించిన పార్లమెంట్ స్థాయి సమావేశానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. 400 ఎంపీలను గెలుచుకోవడం ద్వారా రాజ్యాంగాన్ని, దానితోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఉద్దేశించిన రిజర్వేషన్లను రద్దు చేయాలని కమలనాథులు కుయుక్తులు పన్నుతున్నారని విమర్శించారు. ఈ కుట్రలను ఆయా వర్గాల ప్రజలు అప్ర మత్తంగా ఉంటూ తమ ఓటు ద్వారా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం నాయకులు సుద్దాల లక్ష్మణ్, కొండ్ర సంపత్, స్వరూప, సముద్రాల లక్ష్మణ్, గోశిక శంకర్, తడకపెల్లి భారతి, గడ్డం కొమురక్క ఆత్కూరి శారద, కల్పన, దుప్ప నీరజ, ఆవర్ల లత, మహేశుని భార్గవి తదితరులతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

● వివిధ పార్టీలు ప్రజా సంఘాల్లో పనిచేస్తున్న నాయకులు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ జిల్లా అధ్యక్షులు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కండువాలు కప్పి వారిని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో బోగె పద్మ, శారద, రాజేశ్వరి, బుజ్జమ్మ, సత్యరాజ్ వర్మ, రవి, బోయినపల్లి చంద్రయ్య, తడకపల్లి మధుసూదన్ ఉన్నారు.

వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

-బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థికి మద్దతుగా నాయకుల ప్రచారం



నవాబుపేటలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్ కోడలు డాక్టర్ హర్షిణి

చిగురుమామిడి, మే 9: తెలంగాణా రాష్ట్రం కోసం ఉద్యమాలు చేసిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బోయినిపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోడలు డాక్టరు హర్షిణి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని ముదిమాణిక్యం, నవాబుపేట గ్రామాల్లో గురువారం ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కొత్త వినిత- శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, హన్మండ్ల సత్యనారాయణ, చెప్యాల నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ జక్కుల రవీందర్, షరీఫ్, సది, రమేశ్, మల్లేశం, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

●వీణవంక: మండలంలోని వల్బాపూర్, కొండపాక గ్రామాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ గెలుపు కోసం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు వాల బాలకిషన్‌రావు, ముసిపట్ల తిరుపతిరెడ్డి, కామిడి శ్రీనివాస్‌రెడ్డి, కాసర్ల సుధాకర్, జీడీ వెంకటస్వామి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

●గంగాధర: కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మి మళ్లీ కయ్యలపడవద్దని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. ఆచంపల్లిలో ఉపాధిహామీ కూలీలకు మజ్జిక ప్యాకెట్లు పంపిణీ చేసి ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు విజేందర్‌రెడ్డి, దామోదర్, నాయకుడు మధుసూదన్ తదితరులు ఉన్నారు.

'దేవుడి పేరుతో మోదీ రాజకీయం'

కరీంనగర్ అర్బన్, మే 9: దేవుడి పేరుతో రాజకీయం చేసేందుకే ఎంపీ బండి సంజయ్ వేములవాడకు నరేంద్రమోదీని తీసుకువచ్చారని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పులి ఆంజనేయులుగౌడ్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డిలు విమర్శించారు. కరీంనగర్‌లోని పద్మనాయక మినీ కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వేములవాడలో జరిగిన బీజేపీ బహిరంగ సభలో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కాంగ్రెస్ పార్టీ పట్ల కాంగ్రెస్ పార్టీ నేతలపట్ల చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. బండి సంజయ్ నిర్వహించే ఏ సభల్లో కూడా కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని చెప్పలేదని, ఎంతసేపు రాముని పేరు, మోడీ పేరు జపం చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మడుపు మోహన్, మల్యాల సుజిత్ కుమార్, పట్టణ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగంపల్లి బాబు, జిల్లా కాంగ్రెస్ నాయకులు సాయిరి దేవన్న, విద్యాసాగర్, వరహాల చారి పాల్గొన్నారు.

వామపక్ష నాయకుల ప్రచారం

భగత్‌నగర్, మే 9: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావును గెలిపించాలని కోరుతూ సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు నలువాల సదానందం, మ్యాకల చంద్రయ్య, సాయవేని శ్రీనివాస్, బండి అంజి, బండి సంపత్, కంకటి రాజు పాల్గొన్నారు.

● సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు ఆధ్వర్యంలో నగరంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్ర మంలో మంజుల, పోచయ్య, రమేష్, రజిత, సావిత్ర, పద్మ, లత, రమ, స్వప్న, రమ్య, శోభ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

●కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని సీపీఎం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శిగుడికందుల సత్యం, గజ్జల శ్రీకాంత్, గాజుల కనుకరాజు, రాంపల్లి శ్రీనివాస్, డబిల్‌కత్ శ్రీకాంత్, కండె రాజు, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ముదిరాజ్‌ల మద్దతు

సుభాష్‌నగర్, మే 9: ముదిరాజ్‌ల మద్దతు కాంగ్రెస్ పార్టీకే నని తెలంగాణ ఫిషరీస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు మాల కనకయ్య, మన తెలంగాణ ముదిరాజ్ ఫిషరీస్ సొసైటీ అధ్యక్షుడు మంద నగేశ్ ముదిరాజ్ తెలిపారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

కళాజాతా బృందాల ఓటరు అవగాహన

కరీంనగర్ టౌన్, మే9: రాష్ట్ర ఎన్నికల అధికారి, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల ప్రకారం కళాజాత బృందం ద్వారా పోలింగ్‌పై ఓటరు అవగాహన కార్యక్రమమును కరీంనగర్ ప్రయాణ ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రయాణ ప్రాంగణంలో ఉన్న ప్రయాణీలను ఉద్దేశించి పోలింగ్ తేదీ గురించి పాటల ద్వారా, మాటల ద్వారా అవగాహన కల్పించారు. అందరూ తప్పనిసరిగా ఓటు వేయాలని కోరారు. పోలింగ్ తేదీని తెలుపు స్వీప్ అవగాహన బ్యానర్లు ప్రదర్శించారు. మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల రోజు సెలవు దినం కాదని, అందరూ విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల రోజు పండుగ వాతావరణం ఉండేలా ప్రయాణికులకు అవగాహణ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో అక్రమాలకు అరికట్టడానికి పౌరులు తమ వంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి, ఎన్.రామాచారి, మెప్మా పీడీ బి.రవిందర్, టి.ఎస్.ఆర్.టి.సి సిబ్బంది, సాంస్కృతిక సారధి కళాబృందం తరపున మురళి కళాకారులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

శంకరపట్నం, మే 9: శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలోని జీయం గారి మఠంలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువా రం వెంకటేశ్వరస్వామి కల్యాణం అలివేలు మంగ పద్మావతితో అర్చకులు వెంకటేశ్వరాచార్యులు, రామానుజాచార్యులు వైభవంగా నిర్వహించారు. భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అసైన్డ్ భూముల రెగ్యులరైజ్ హామీని నిలబెట్టుకోవాలి

కరీంనగర్ టౌన్, మే 9: గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని ఎస్సీలకు చెందిన అసైన్డ్ భూములను రెగ్యులరైజ్ చేసి హామీని నిలబెట్టుకోవాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ అధికారప్రతినిధి దుర్గం మారుతి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఒక ప్రకటనలో కోరారు. 1960, 61 సంవత్సరంలో భూమిలేని నిరుపేద ఎస్సీలకు ప్రభుత్వ భూములను అసైన్మెంట్ చేశారని అన్నారు. అయితే ఇప్పటి వరకు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఇచ్చిన అసైన్‌మెంట్ భూములపై ఇప్పటి వరకు పట్టా హక్కులు ప్రభుత్వాలు కల్పించలేదని అన్నారు. అత్యవసరాల కోసం ఆ భూములను అమ్ముకునేందుకు చట్టంలో మార్పు తేవాలని నిరుపేదలు కోరుతున్నారని, రేవంత్‌రెడ్డి తాము అధికారంలోకి వస్తే రెగ్యులరైజ్ చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మారుతి కోరారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

గన్నేరువరం, మే 9: పదేళ్ల పాలనలో ప్రజాస్వామ్యా న్ని బీజేపీ ఖూనీ చేస్తోందని, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు గుణపాఠం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా గురువారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయ ణతో కలిసి ఆయన గడపగడపకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ నియంత లా వ్యవహరిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే దేశంలో సామాజిక న్యాయం సాధ్యమని సీపీఐ పార్టీ కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు తెలిపిందని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ నియంతృత్వ పోకడలతో ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న నరేంద్రమోదీని గద్దెదించాలని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని బతికించేందుకు కాంగ్రెస్ చేస్తున్న పోరాటానికి సీపీఐ మద్దతు తెలుపడం అభినందనీయమని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి మరింత బలం చేకూర్చడానికి పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేం దుకు ప్రజలందరూ హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమం లో సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, ఏఐవైఎఫ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి మహేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, నాయకులు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, చిట్కూరి అనంతరెడ్డి, బొడ్డు సునీల్, జువ్వాడి మన్‌మోహన్ రావు, చింతల శ్రీధర్‌రెడ్డి, మాతంగి అనిల్, బూర వెంకటేశ్వర్, శ్రీకాంత్, మైసంపల్లి తిరుపతి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు



బీజేపీలో చేరిన వారితో ఎంపీ బండి సంజయ్

శంకరపట్నం, మే 9: శంకరపట్నం మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మంద సత్యనారాయణ, సింగిల్ విండో డైరెక్టర్ వెంగల ప్రవీణ్, మాజీ వార్డు మెంబర్ వెంగల ప్రవీణ్, కో-ఆప్షన్ సభ్యుడు పంజాల స్వామి, నాయకులు బోరగళ్ల శ్రీనివాస్, గీట్ల సంపత్‌రెడ్డి, వెంగల రజినీకాంత్, వెంగల ప్రవీణ్, బైరి రాజయ్యలు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ సమక్షంలో బీజేపీలో చేరారు.

ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు కొంరయ్య, మందాటి జగ్గారెడ్డి, నాయకులు దొంగల రాములు, రాసమల్ల శ్రీనివాస్, ఎడిగ మధు, గీట్ల జగ్గారెడ్డి, వెంగల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సేవాదళ్ అధ్యక్షుడిగా మోర భద్రేశం

చొప్పదండి, మే9: చొప్పదండి నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడిగా దేశాయిపేట గ్రామానికి చెందిన మోర భద్రేశంను నియమిస్తూ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. సేవాదళ్ అభివృద్ధికి పాటుపడుతామని తెలిపారు.

చీరల పట్టివేత



చీరలతో పట్టుబడిన ట్రాలీ ఆటోను చూపుతున్న సీఐ సరిలాల్

కరీంనగర్ క్రైం, మే 9: కరీంనగర్ బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద ఒకటో ఠాణా సీఐ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన తనిఖీలలో చీరలు పట్టుబడ్డాయి. ఒక ఆటోలో తరలిస్తుండగా 1 లక్షా 15 వేల విలువైన చీరలు పట్టుకున్నామన సీఐ సరిలాల్ తెలిపారు. కరీంనగర్ వినాయక్‌నగర్‌కు చెందిన వెంగలదాస్ వెంకటరమణకు చెందిన ఆటో ట్రాలీలో ఎలాంటి రశీదులు లేకుండా చీరలు, ఇతర బట్టలు తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. సీజ్ చేసిన చీరలు, బట్టలు, ఆటోను సంబంధిత ఎన్నికల విభాగం అధికారులకు స్వాధీనం చేశామని సీఐ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ
ఎన్నికల కో ఆర్డినేటర్‌గా ప్రభాకర్

కరీంనగర్ లీగల్, మే 9: కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల కో ఆర్డినేటర్‌గా సీనియర్ న్యాయవాది రాచకొండ ప్రభాకర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్ హ్యూమన్ రైట్స్ అండ్ ఆర్‌టీఐ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ప్రభాకర్‌కు గురువారం సంబం ధిత ఉత్తర్వులు అందాయి. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, కరీంన గర్ ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావుకు ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

స్వతంత్ర అభ్యర్థి వినూత్న ప్రచారం

హుజూరాబాద్, మే 9: హుజూరాబాద్ పట్టణంలో గురువారం వారసంత కావడంతో కరీంనగర్ స్వతంత్ర ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బరిగే గట్టయ్య వినూత్న రీతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అతనికి వచ్చిన గుర్తు గ్యాస్ పొయ్యిని పట్టుకొని కూరగాయల మార్కెట్‌లో తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. దీన్ని ప్రజలు ఆసక్తి కనబర్చారు. కాగా గట్టయ్య హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని దమ్మక్కపేట గ్రామానికి చెందిన వాడు. గట్టయ్య ఇప్పటికే ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో తరుచూ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తూ ఉంటాడు.

కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

వీణవంక, మే 9: మండల కేంద్రంతో పాటు కిష్టంపేట, వల్బాపూర్, లస్మక్కపల్లి తో పాటు పలు గ్రామాల్లోని బీఆర్ఎస్, బీజేపీల నాయకులు, కార్యకర్తలు రాజీనా మా చేసి గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి హుజూరాబాద్ నియోజక వర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ముఖ్య అనుచరుడు సిద్దపల్లి మహిపాల్ రెడ్డి, వీణవంక మాజీ సర్పంచ్ చినాల అయిలయ్య తదితరులు ఉన్నారు. కార్యక్ర మంలో ఎక్కటి రఘుపాల్ రెడ్డి, గంగాడి తిరుపతిరెడ్డి, కొమ్మిడి రాకేష్‌రెడ్డి, మాదాసి సునీల్, భగవాన్ రెడ్డి, సాహెబ్ హుస్సేన్, పంజాల సతీష్, మందాడి అనిల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సైదాపూర్: బీఆర్ఎస్ సీనియర్ నాయ కుడు, హుజూరాబాద్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పోలు ప్రవీణ్‌కుమార్ తన అనుచరులతో గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దొంత సుదాకర్, నాయకులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: చిగురుమామిడి మాజీ జడ్పీటీసీ సభ్యుడు, బీఆర్ఎస్ పార్టీ సీని యర్ నాయకుడు వీరమల్ల చంద్రయ్య గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతో సుమారు 40 మంది అనుచరువు కాంగ్రెస్ పార్టీలో చేరగా మంత్రి కండువాలు వేసి ఆహ్వానించారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులతో వొడితెల ప్రణవ్

రుక్మాపూర్‌లో వైద్య శిబిరం

చొప్పదండి, మే 9: మండలంలోని రుక్మాపూర్ గ్రామం లో గురువారం రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చెర్మన్ పెండ్యాల కేశవరెడ్డి, కార్యదర్శి ఊట్కూరు రాధకృష్ణారెడ్డి, సభ్యులు కోల అన్నారెడ్డి, మెడికల్ ఆఫీసర్ ఎంఎల్ఎన్‌రెడ్డి, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బాలుడికి చేయూత

మానకొండూర్, మే 9: మండలంలోని కొండపల్కల గ్రామానికి చెందిన రేవేని సాయిచరణ్ ఇటీవల అనారోగ్యానికి గురి కాళ్లు, చేతు లు చచ్చుపడిపోయి నడవలేని స్థితిలో ఉండడంతో బీజేపీ నాయకులు గురువారం ఐదువేల రూపాయలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకట్ రెడ్డి, రావుల శంకరాచారి, దూలం కిరణ్, అడప రవి, పురుషోత్తం, కొ మురవెల్లి, కుమార్, బొందయ్య, శ్రీనివాస్, బానుచందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.